క్లుప్తంగా

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపుతున్న పోలీసులు

మునిపల్లి(అందోల్‌): మండల పరిధిలోని బుదేరా చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా బుదేరా వైన్‌షాపు నుంచి మందు తరలిస్తున్న ఆటోను స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేశారు. ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో తరలిస్తున్న 575 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. వికారాబాద్‌ జిల్లా మర్పల్లి మండల ప్రజాప్రతినిధితో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

జహీరాబాద్‌ మండలంలో..



జహీరాబాద్‌: మండలంలోని బూచనెల్లి గ్రామంలో అక్రమంగా అమ్ముతున్న కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ అశోక్‌ కుమార్‌ తెలిపారు. బుధవారం నమ్మదగిన సమాచారం అందుకుని కర్ణాటకకు చెందిన 20 మద్యం బాటిళ్లు, తెలంగాణకు చెందిన 20 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎస్‌ఐలు గిరి, అంజయ్య, హెడ్‌ కానిస్టేబుల్‌ యాదయ్య, కానిస్టేబుళ్లు శంకర్‌ నాయక్‌, మల్లమ్మ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ కారు తనిఖీ



సురేశ్‌షెట్కార్‌ కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

నారాయణఖేడ్‌: టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్‌ షెట్కార్‌, మాజీ జెడ్పీ కోఆప్షన్‌ సభ్యుడు రషీద్‌, సిర్గాపూర్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు మనీష్‌పాటిల్‌, నాయకులు కొండల్‌ రెడ్డిలతో కలిసి బుధవారం ఖేడ్‌ ప్రాంతంలోని పలు గ్రామాల్లో జరిగిన వివాహ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలంలోని గ్రామాల్లో వివాహ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్న నేపథ్యంలో ముక్తాపూర్‌ వద్ద ఆయన కారును నిలిపి తనిఖీ చేశారు. ఎలాంటి నగదు, వస్తువులు లేకపోవడంతో పంపించి వేశారు.

అయ్యప్ప దీక్షతో మానసిక ప్రశాంతత

పెద్దశంకరంపేట(మెదక్‌): అయ్యప్ప దీక్షతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని గురుస్వామి రామచంద్రాచారి అన్నారు. బుధవారం పలువురు భక్తులు అయ్యప్ప దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి మాలధారణ నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు రాములు, శ్రీహరి, మహేందర్‌, సురేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌ తనిఖీ



అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల సిబ్బంది

చేగుంట(తూప్రాన్‌): మండల కేంద్రం చేగుంటలోని అంబులెన్స్‌లను జిల్లా ఎన్నికల సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్‌ ముగిసే వరకు ఎలాంటి అనుమానిత వస్తువులను రవాణా చేయరాదని సూచనలు చేశారు. అంబులెన్స్‌ నిర్వాహకులు ఎన్నికల నిబంధనల మేరకు విధులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారులు పీఎం జనార్దన్‌, ఈఎంతు మహేశ్‌, అంబులెన్స్‌ నిర్వాహకులు రమేశ్‌, నవీన్‌, శ్రీకాంత్‌, సురేశ్‌ ఉన్నారు.

పోలింగ్‌ కేంద్రంలో సీసీ కెమెరా, ఫ్యాన్లు చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్‌): మండల కేంద్రమైన కౌడిపల్లి పోలింగ్‌ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి ఒక సీసీ కెమెరా, మూడు ఫ్యాన్లు చోరీ చేశారు. బుధవారం పోలింగ్‌ కేంద్రం ఇన్‌చార్జి ప్రణయ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పోలింగ్‌ కేంద్రం వద్ద మంగళవారం రాత్రి వరకు ఫ్యాన్లు, సీసీ కెమెరాలు బిగించి ఇతర ఏర్పాట్లు చేసి, తాళం వేసి వెళ్లామని చెప్పారు. కాగా ఉదయం వచ్చి చూడగా 90వ పోలింగ్‌ కేంద్రం గదిలో గుర్తు తెలియని వ్యక్తి తాళం పగులగొట్టి పోలింగ్‌ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాతో పాటు మూడు ఫ్యాన్లు చోరీ చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- దివ్యాంగులకు ప్రత్యేక పోలింగ్‌ కేంద్రాలు
- సమస్యాత్మక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత
- ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్‌



సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్‌: నియోజకవర్గంలో పురుషులు: 2,05,045, మహిళలు 1,92,116, ఇతరులు: 76 మొత్తం: 3,97,237 మంది ఓటర్లు ఉన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్‌ కొనసాగుతుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో మొత్తం 16 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. కాంగ్రెస్‌ నుంచి కాట శ్రీనివాస్‌గౌడ్‌, బీఆర్‌ఎస్‌ నుంచి మహిపాల్‌రెడ్డి, బీఎస్పీ నుంచి నీలం మధు ముదిరాజ్‌, బీజేపీ నుంచి నందీశ్వర్‌గౌడ్‌, సీపీఎం నుంచి మల్లికార్జున్‌ ఉన్నారు. 405 పోలింగ్‌ కేంద్రాల గాను 71 సమస్యాత్మక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి తెలిపారు.

అందోల్‌ నియోజకవర్గంలో..

వట్‌పల్లి(అందోల్‌): నియోజకవర్గంలోని వట్‌పల్లి, అందోల్‌, పుల్కల్‌, అల్లాదుర్గ్‌, రేగోడ్‌, టేక్మాల్‌, రాయికోడ్‌, మునిపల్లి, చౌటకూర్‌ మండలాల పరిధిలో 2,49248 మంది ఓటర్లు ఉండగా అందులో 1,26,543 మంది మహిళా ఓటర్లు, 1,22,699 మంది పురుషులు, 06 మంది ఇతరులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 35 రూట్లు, 313 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేయగా, 1417మంది పీఓ, ఏపీఓలు ఎన్నికల పోలింగ్‌లో విధులు నిర్వహించనున్నారు. పోలింగ్‌ కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లను పూర్తిచేశారు. దివ్యాంగులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో..

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్‌ పరిధిలో 33, జిన్నారం మండలంలో 25, గుమ్మడిదల మండలంలో 35 పోలింగ్‌ కేంద్రాలు ఉండగా 558మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

న్యాల్‌కల్‌ మండలంలో..

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 62పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేయగా 248మంది పోలింగ్‌ సిబ్బందిని నియమించారు. ఎన్నికల్లో 47,000 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. బుధవారం సాయంత్రం నుంచే ఈవీఎంలతో సిబ్బంది పోలింగ్‌స్టేషన్లకు చేరుకున్నారు. గురువారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటలకు పోలింగ్‌ జరగనుంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌ బందోబస్తును ఏర్పాటు చేశారు.

నారాయణఖేడ్‌ నియోజకవర్గంలో..

నారాయణఖేడ్‌: నియోజకవర్గంలో 8మండలాల్లో 2,31,188మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,16,581, స్త్రీలు 1,14,599 మంది, ఇతరులు 8మంది ఉన్నారు. మొత్తం 296 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో 66 ప్రాంతాలను సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలుగా గుర్తించారు. 35రూట్లుగా విభజించారు. ఎన్నికల నిర్వహణకు గాను 338మంది పీవోలు, 338మంది ఏపీవోలు, 676ఓపీవోలు, 1,352మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ఎన్నికల సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశారు. ఏఎస్పీ అశోక్‌కుమార్‌, ఈఆర్వో వెంకటేశ్‌, పరిశీలకులు దీపక్‌సింగ్లా సామగ్రి పంపిణీని పర్యవేక్షించారు. కలెక్టర్‌, జిల్లా ఎన్నికల పరిశీలకులు డాక్టర్‌ శరత్‌ ఏర్పాట్లను పరిశీలించారు.



న్యాల్‌కల్‌లో పోలింగ్‌ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది



నారాయణఖేడ్‌: పోలింగ్‌ కేంద్రాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది



జహీరాబాద్‌: ఎన్నికల సామగ్రితో పోలింగ్‌ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

పోలింగ్‌ కేంద్రాలకు తరలిన సిబ్బంది

జహీరాబాద్‌: పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి వెంకారెడ్డి పర్యవేక్షణలో సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అప్పగించారు. నియోజకవర్గంలో 314 పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 35 రూట్లుగా గుర్తించి సిబ్బందిని వాహనాల్లో పోలింగ్‌ కేంద్రాలకు తరలించారు. డీఎస్పీ రఘు ఆధ్వర్యంలో సీఐ రాజు, ఎస్‌ఐ శ్రీకాంత్‌ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

పటాన్‌చెరు టౌన్‌: నియోజకవర్గంలోని రుద్రారం గ్రామం గీతంకు చెందిన చైతన్య కళాశాలలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంల పంపిణీ చేశారు. 405 పోలింగ్‌ కేంద్రాలకు 2830 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 1900 మంది ఓపీఓలు ఉండగా 465 మంది పీఓలు, 465 మంది ఏపీఓలు విధులు నిర్వహించనున్నారు. 405 ఈవీఎంలతో పాటు 810 కంట్రోల్‌ యూనిట్లు, వీవీప్యాట్లను అందజేశారు. 28 ప్రాంతాల్లో 71 సమస్యాత్మక పోలింగ్‌ బూత్‌లను గుర్తించి పోలీస్‌ బలగాలతో పాటు 28 మంది క్షేత్రస్థాయి పరిశీలకులను నియమించారు. ఎప్పటికప్పుడు పోలింగ్‌ పరిస్థితులు ఆన్‌లైన్‌ ద్వారా తెలుసుకునేందుకు 251 పీఎస్‌లో వెబ్‌కాస్టింగ్‌ పెడుతున్నామని రిటర్నింగ్‌ అధికారి దేవుజా తెలిపారు. సామగ్రి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్‌ శరత్‌, పటాన్‌చెరు జనరల్‌ అబ్జర్వర్‌ నజీమ్‌ జైఖాన్‌, పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి పరిశీలించారు.



పటాన్‌చెరు టౌన్‌: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మోడల్‌ పోలింగ్‌ కేంద్రం



వట్‌పల్లి: ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న పోలింగ్‌ సిబ్బంది



జిన్నారం: జంగంపేటలోని పోలింగ్‌ కేంద్రం వద్ద విధుల్లో సిబ్బంది

నగదు స్వాధీనం

హత్నూర(సంగారెడ్డి): పోలింగ్‌ కేంద్రం వద్ద కాంగ్రెస్‌ పార్టీకి చెందిన నాయకుల నుంచి నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వేణుకుమార్‌ ఎస్‌ఐ సుభాష్‌ తెలిపారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రం వద్ద కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద రూ 56,240 నగదును గుర్తించి స్వాధీనం చేసుకొని ఇరువురిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌ తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్‌ కేంద్రాల పరిశీలన



రెడ్డిపల్లి పోలింగ్‌ కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

చేగుంట(తూప్రాన్‌): మండలంలోని రెడ్డిపల్లిలోని పోలింగ్‌ కేంద్రాలను తూప్రాన్‌ ఆర్డీఓ జయచంద్రారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డిపల్లిలోని 221, 222, 223 నంబర్ల పోలింగ్‌ కేంద్రాలను తనిఖీ చేసి, కేంద్రాల్లోని వసతులు ఓటర్లకు తొందరగా అర్థమయ్యేలా చేసిన ఏర్పాట్లు పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన పలు జాగ్రతలను ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్‌ గియాసున్నిసాబేగం, ఆర్‌ఐ నర్సింగ్‌ యాదవ్‌ తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌ రహిత సమాజమే ధ్యేయం

హుస్నాబాద్‌: ప్రపంచ ఎయిడ్స్‌ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. జిల్లెల్లగడ్డ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (బాలుర) ఇంటర్మీడియట్‌ విద్యార్థులకు ఎయిడ్స్‌ రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈసందర్భంగా ఐసీటీసీ కౌన్సెలర్‌ తిరుపతి మాట్లాడుతూ.. జీవితంలో ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ ఎయిడ్స్‌ రహిత సమాజం కోసం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ వాసుదేవ్‌, హెల్త్‌ సూపర్‌వైజర్‌ శ్రీకాంత్‌ అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్‌ తిరుపతి

భక్తి మార్గంలో నడవండి



గురుమూర్తులను సన్మానిస్తున్న సర్పంచ్‌ గౌరమ్మ కుటుంబ సభ్యులు

మునిపల్లి(అందోల్‌): ప్రతిఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్‌ భక్తులకు ఉపదేశించారు. బుధవారం మండలంలోని బుదేరా గ్రామ శివారులోని ఆంజనేయస్వామి దేవాలయంలో దత్తపాదుకల స్థాపన కార్యక్రమాన్ని ఆలయ నిర్మాణ దాతలు నీల శోభరాణి, వెంకటేశంగుప్తా, అన్నపూర్ణ, రాజేశ్వర్‌గుప్తా, పద్మ, రమేశ్‌గుప్తా ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవదేత గిరి మహారాజ్‌ మాట్లాడుతూ ముక్తి పొందాలంటే భక్తి తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బుదేరా సర్పంచ్‌ గౌరమ్మ, మాజీ ఎంపీపీలు బుదేరా రాజేశ్వర్‌రావు, తాటిపల్లి రాంరెడ్డి, బుదేరా మాజీ ఎంపీటీసీ మనోహర్‌యాదవ్‌, భక్తులు పాల్గొన్నారు.

పీఠాధిపతి, గురుమూర్తులకు సన్మానం

మండలంలోని బుదేరా గ్రామ శివారులో వీరాంజనేయస్వామి దేవాలయం పునఃనిర్మాణోత్సవంలో భాగంగా ఆయా పీఠాధిపతులకు బుదేరా సర్పంచ్‌ మన్నె గౌరమ్మ, మాజీ ఎంపీటీసీ మనోహర్‌యాదవ్‌ శాలువతో సన్మానించి గురుమూర్తుల ఆశీర్వాదం తీసుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ సత్యనారాయణరెడ్డి

- సీఐ సత్యనారాయణరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పోలింగ్‌ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు విధులు నిర్వర్తించాలని సీఐ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం రూట్‌ మొబైల్‌ అధికారులు, సిబ్బంది, పోలింగ్‌కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీప్యాట్‌లు, ఎన్నికల సామగ్రి రక్షణ పూర్తి బాధ్యత రూట్‌ మొబైల్‌ అధికారులదే అన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని, రాబోయే 48 గంటలు చాలా కీలకమన్నారు. ప్రతి ఎన్నిక కొత్త అనుభవాన్ని నేర్పిస్తుందని.. అధికారులందరూ సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోండి



వెల్దుర్తి పోలింగ్‌ కేంద్రానికి చేరుకున్న పోలింగ్‌ సిబ్బంది

వెల్దుర్తి(తూప్రాన్‌): ఉమ్మడి వెల్దుర్తి మండల వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వెల్దుర్తి మండలంలో 23,941 మంది ఓటర్లు ఉండగా మహిళలు 12,303, పురుషులు 11,638 ఉన్నారు. మండలంలో 33 పోలింగ్‌ బూతులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మాసాయిపేట మండలంలో సుమారు 9 వేల ఓటర్లకు గాను 12 పోలింగ్‌ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల వద్ద ఓటర్లు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు వెల్దుర్తి తహసీల్దార్‌ తులసీరాం, మాసాయిపేట తహసీల్దార్‌ జ్ఞానజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఓటర్లందరికి బూత్‌ లెవల్‌ అధికారుల ద్వారా ఇంటింటికీ పోలింగ్‌ స్లిప్పులు అందజేశామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో విలువుందని, ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవడం మరువద్దు అన్నారు.

జాతీయ స్థాయి సైక్లింగ్‌ పోటీలకు విద్యార్థులు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): జాతీయ స్థాయి సైక్లింగ్‌ పోటీలకు హుస్నాబాద్‌ విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ మేరకు రాంచీలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే పోటీలకు వలేని వరుణ్‌రెడ్డి, సూరంపల్లి సుష్మిత్‌, అబ్బారబోయిన రామకృష్ణ, బాలు నిఖిల్‌ వెళ్లనున్నారు.ఈ మేరకు సిద్దిపేట జిల్లా సైక్లింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాస్‌, జంగపల్లి వెంకట నర్సయ్య బుధవారం పేర్కొన్నారు. ఈనెల 5, 6వ తేదీల్లో హైదరాబాద్‌లో ఉన్న ఉస్మానియా వర్సిటీ పరిధిలో వెల్లోడ్రుంలో జరిగిన రాష్ట్రస్థాయి ట్రాక్‌ సైక్లింగ్‌ పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారు. జిల్లా క్రీడల యువజన అభివృద్ధి అధికారి నాగేందర్‌, స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ చైర్మన్‌ పాల సాయిరాం, జిల్లా పాఠశాలల సమైక్య కార్యదర్శి పన్యాల రామేశ్వర్‌ రెడ్డి తదితరులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రాంచంద్రం

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండలకేంద్రంలో జరిగింది. భూంపల్లి పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. భూంపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాంచంద్రం (45) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన బాల్‌షెట్టి రాజాగౌడ్‌ వ్యవసాయ బావి వద్ద కరెంటు పోల్‌కు కరెంటు తీగలు అమర్చడానికి కూలీ పని కోసం వెళ్లాడు. అక్కడ కరెంటు తీగలు అమర్చుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు 33/11కేవీ కరెంటు తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్‌ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

రూ.3లక్షల నగదు పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): రూ.3 లక్షల నగదును బుధవారం ఫ్లయింగ్‌స్క్వాడ్‌ అధికారులు పట్టుకున్నారు. పట్టణంలోని వీరభద్ర థియేటర్‌ సమీపాన ఉన్న ఒక ఇంట్లో బయటి వ్యక్తులు ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు అధికారులు అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి ఆధారాలు లభించక పోవడంతో రూ.3 లక్షలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గాలివాన బీభత్సం

- నేలవాలిన పంటలు
- విరిగిపడిన చెట్లు
- తెగిపడిన విద్యుత్‌ తీగలు

మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో చెట్లు కూలిపోయాయి. విద్యుత్‌ తీగలు తెగిపోయి విద్యుత్‌ సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల జొన్న, పత్తి, కంది పంటలు నేలవాలడంతో చేతికి వచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి నిలిచిపోయిన కరెంట్‌ ఉదయం 11గంటల వరకు కూడా రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

- న్యాల్‌కల్‌(జహీరాబాద్‌)



గుంజోటి గ్రామంలో నేలవాలిన జొన్న పంట



అమీరాబాద్‌లో దెబ్బతిన్న పత్తి పంట



గుంజోటి గ్రామంలో నేలవాలిన కంది పంట